## క్లుప్తంగా

### పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

బొబ్బిలి: వ్యవసాయ శాఖ బొబ్బిలి డివిజన్ పరిధిలో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచామని వ్యవసాయ శాఖ ఎ.డి మజ్జి శ్యామ్‌సుందరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీలుగ, కట్టిజనుమ, పిల్లి పెసర, తదితర పచ్చిరొట్ట విత్తనాలను రాబోయే ఖరీఫ్ సీజన్ కోసం సిద్ధం చేశామన్నారు. ఇందులో జీలుగ 500 క్వింటాళ్లు, కట్టి జనుము 400, పిల్లిపెసర వంద క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. విత్తనాలపై 50 శాతం రాయితీ ఇస్తామన్నారు.

### బాల్య వివాహాలు అరికట్టాలి

తెర్లాం: గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా కిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. మండలంలోని నందిగాం, తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రాల్లో సఖీ అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నందిగాంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కిశోర బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. నిర్ణీత వయసువచ్చే వరకు వివాహాలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతుడు అప్పలనాయుడు

బాడంగి: మండలంలోని ఆకులకట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తెంటు అప్పలనాయుడు (48)అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పలనాయుడును రాజాం కేర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పలనాయుడుకు భార్య శ్రీదేవి, కుమారుడు మణికంఠ, కుమార్తె శిరీష ఉన్నారు. ఈయన మృతిపట్ల ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, జేసీఎస్ మరిపి శంకరరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

### త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు



పాలకొండ రోడ్డులో రోడ్డు విస్తరణ కొలతలు తీస్తున్న అధికారులు

రాజాం: ప్రధాన రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. శనివారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు విస్తరణ చేయనున్న రోడ్డును పరిశీలించిన ఆయన 80 అడుగుల మేర రోడ్డును వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న షాపులను తొలగించే కార్యక్రమం ప్రారంభించామన్నారు. వర్షాకాలం నాటికి రోడ్డు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావు, టీపీఓ నాగలత ఉన్నారు.

### మండలానికి క్రాస్‌ప్రోగ్రాం మెటీరియల్



ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న క్రాస్ ప్రోగ్రాం మెటీరియల్

రేగిడి: మండలానికి క్రాస్ ప్రోగ్రాం మెటీరియల్ వచ్చి చేరుకుంది. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా తాగునీటి బోర్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు రూ.5 లక్షల విలువైన సామగ్రి ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చినట్లు ఎంపీడీఓ కాశీవిశ్వనాధరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్‌లు తెలిపారు.

### బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మండల పరిషత్ ప్రత్యేకాధికారి పెంటోజీరావు

రేగిడి: మండల స్థాయి అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి పెంటోజీరావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశమైన ఆయన ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రశ్నించారు. అర్హులకే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# గడప గడపకూ సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



వాసవీనగర్‌లో గడప గడపకు వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలోని ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పట్టణంలోని సత్యనారాయణపురం సచివాలయం పరిధిలో ఉన్న ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్, వాసవీనగర్ ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపలో సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా ప్రజలు కష్టాలు పడకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, పి.లక్ష్మణరావు, జి.నారాయణరావు, దాలినాయుడు, వి.వి జయ్‌కుమార్, పి.శ్యామ్‌సుందరరావు, ఎస్.వేణుగోపాలనాయుడు, టి.చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు
- పాములవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెర్లాం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పాములవలసలో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ నేరుగా చేరుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజాధనం లూటీ చేశాయని ఆరోపించారు. ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో జగనన్న అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గర్భాపు లూర్థు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బోను అప్పలనాయుడు, గర్భాపు రామారావు, తెంటు సత్యంనాయుడు, పాములవలస సర్పంచ్ చప్ప సుధ ఈశ్వరరావు, వి.చిన్నయ్యపేట ఎంపీటీసీ సభ్యుడు చింత సింహాచలం అప్పారావు, ఈఓపీఆర్‌డీ రాంబాబు, వివిధ శాఖల మండల అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆప్యాయతతో కూడిన వైద్యం అందించండి

- ఎమ్మెల్యే శంబంగి



ఆరోగ్య సలహా సంఘు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీహెచ్‌సీకి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించి వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అజెండాలోని 17 అంశాలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ జి. శశిభూషణరావు కొత్తగా విధుల్లో చేరిన వైద్యులను పరిచయం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సభ్యులు తూముల బంగారురాణి, సుబ్బారావు, బొబ్బిలి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన

వంగర: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనిలోకి వచ్చిన వారికే మస్తర్లు వేయాలని, బోగస్ మస్తర్లు వేయరాదన్నారు. వేసవి నేపథ్యంలో రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పని చేయాలన్నారు. నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు.

### రేపటి నుంచి ఉద్దంగిలో 'గడప గడపకు..'

మెంటాడ: మండలంలోని ఉద్దంగిలో ఈ నెల 8,9 తేదీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొంటారని, అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

# ప్రజలందరిపైనా పైడితల్లి దీవెనలు

- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శంబంగి



హోమగుండం వద్ద పూజలు చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

తెర్లాం: పైడితల్లి అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆకాంక్షించారు. మండలంలోని కొల్లివలసలో నూతనంగా నిర్మించిన పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు హోమంలో పాల్గొన్నారు. ఆయన వెంట గ్రామపెద్దలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులున్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని వస్త్రపురి కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సీఎస్‌డీటీ ఆధ్వర్యంలో అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు వారణాశి వెంకటరాజు అక్రమంగా నిల్వ చేసిన 300 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు 6-ఏ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా బియ్యం నిల్వ ఉంచినా తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

- ప్రత్యేకాధికారి గోవిందరావు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గోవిందరావు

రామభద్రపురం: మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్, మండల ప్రత్యేకాధికారి గోవిందరావు అన్నారు. సఖి కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ సుబ్బారావుతో కలసి వైద్యారోగ్య, పోలీస్, ఐసీడీఎస్ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మహిళలు, చిన్నారుల భద్రతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాల నియంత్రణతో పాటు దిశ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరించాలన్నారు.

### కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సంతకవిటి: కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, మహిళా పోలీసులతో 'సఖి' సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కిశోరి బాలికల్లో రక్తహీనత లేకుండా, హిమోగ్లోబిన్ శాతం తగ్గకుండా చూడాలని తెలిపారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్‌కుమార్, తహసీల్దార్ ఎ.సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



సంతకవిటి: హౌసింగ్ డే నిర్వహిస్తున్న ఎంపీడీఓ రఘునాధాచారి

సంతకవిటి: సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి సూచించారు. శనివారం మండలంలోని జీ.ఎస్.పురం గ్రామంలో హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణాల పురోగతిపై లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

రాజాం: మండలంలోని వీఆర్‌అగ్రహారం గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి సకాలంలో నిర్మాణ సామగ్రి, బిల్లులు ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. నిర్మాణాలు ప్రారంభించని వారెవరైనా ఉంటే వెంటనే నిర్మాణాలు ప్రారంభించి, పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. మండల కేంద్రంలో హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఏఈ జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు నిరోధించాలి

- మండల ప్రత్యేకాధికారి వైవీ శ్యామ్‌కుమార్



సఖి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

బొబ్బిలి: బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి, మార్కెటింగ్ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వైవీ శ్యామ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.డి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో అంగన్‌వాడీ, వైద్య, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న వయసులో వివాహాలు చేస్తే కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సీడీపీఓ ఎం. విజయలక్ష్మి, వైద్యులు సంతోష్‌కుమార్, రమేష్, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు..**

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి వైవీ శ్యామ్‌కుమార్ అన్నారు. మండలంలోని పారాది జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు బిల్లులు వెంటవెంటనే చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, హౌసింగ్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- తహసీల్దార్ డోల రాజేశ్వరరావు



వేసవి శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: వేసవిలో పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనిరవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేసవి శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8 నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం కానుందని తెలిపారు. వచ్చే నెల 30 వరకు గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థులను వారి తల్లిదండ్రులు పంపించాలన్నారు. ఆయనతో పాటు శాఖా గ్రంథాలయ నిర్వాహకుడు సీహెచ్. కృష్ణమూర్తి ఉన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం



తెర్లాం: ఆమిటిలో నిర్వహించిన హౌసింగ్ డేలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ అప్పయ్య

తెర్లాం: జగనన్న కాలనీల్లో.. సొంత స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని బొబ్బిలి గృహ నిర్మాణశాఖ డీఈఈ పలగర అప్పయ్య అన్నారు. మండలంలోని ఆమిటి గ్రామంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ అప్పయ్య లబ్ధిదారులతో మాట్లాడుతూ, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఆయనతోపాటు గ్రామపెద్ద లవకుమార్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

**త్వరగా పూర్తిచేయాలి..**

బాడంగి: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.యశోధనరావు కోరారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గజరాయునవలసలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరమ్మ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటనాయుడు, వీఆర్‌ఓ దేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



బాడంగి: గజరాయునివలసలో హౌసింగ్ డే నిర్వహిస్తున్న అధికారులు

# పదో తరగతి ఫలితాల్లోప్రభుత్వ పాఠశాలల హవా

బొబ్బిలి: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హవా కనబరిచారు. శనివారం విడుదలైన ఫలితాల్లో పట్టణంలోని సింహాలతోటలో ఉన్న గురుకుల పాఠశాల విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారు. 79 మంది విద్యార్థులకు గాను అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఎల్ షణ్ముఖరావు అత్యధిక మార్కులు సాధించాడు. మండలంలోని కారాడ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోది తెలిపారు. 73 మందికి అందరూ పాసవ్వగా.. బడే సోమశేఖర్ టాపర్‌గా నిలిచాడు. మెట్టవలస జెడ్పీ హైస్కూల్‌లో అరసాడ వివేక్.. నారసింహునిపేట జెడ్పీ హైస్కూల్‌లో చొంగల భవానీ ప్రతిభ కనబరిచింది. పట్టణంలోని గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూల్‌లో అత్యధిక మార్కులు సాధించిన కె. పవన్ ప్రసన్నకుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

**సత్తాచాటిన పాల్తేరు, గొల్లాది..**

బాడంగి: మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లు, గురుకులం, కేజీబీవీలు సత్తా చాటాయి. పాల్తేరు హైస్కూల్ 80 శాతం, గొల్లాది హైస్కూల్ 72 శాతం, బాడంగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 61 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే కోడూరు, రేజేరు పాఠశాలలు 58 శాతం, వాడాడ హైస్కూల్ 52 శాతం, కేజీబీవీ 49 శాతం ఫలితాలు సాధించాయని సంబంధిత హెచ్‌ఎంలు చెప్పారు. పాల్తేరు హైస్కూల్‌లో 40 మందికి 32 మంది ఉత్తీర్ణులవ్వగా కె.మురారి, కె.జ్యోతిచక్రధర్ మంచి మార్కులు సాధించారు. గొల్లాది హైస్కూల్‌లో 21 మందికి 16మంది ఉత్తీర్ణత సాధించారు. బాడంగి హైస్కూల్‌లో 147 మందికి 89 మంది ఉత్తీర్ణత సాధించగా..ఆర్.హర్షవర్ధన్, పి.కిరణ్మయి అత్యధిక మార్కులు సాధించారు. అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో 66 మందికి 40 మంది ఉత్తీర్ణులవ్వగా టి.నాని టాపర్‌గా నిలిచాడు. కోడూరు హైస్కూల్ నుంచి 49 మందికి 28 మంది పాసవ్వగా ఎన్.శిరీష ప్రతిభ కనబరిచింది. రేజేరు హైస్కూల్‌లో 75 మందికి 43 మంది ఉత్తీర్ణత సాధించగా.. సీహెచ్.చంద్రశేఖర్ మంచి మార్కులు సాధించాడు. వాడాడ హైస్కూల్‌కు చెందిన 56 మంది విద్యార్థులకు 29 మంది పాసవ్వగా.. కె. శివరామరాజు ప్రతిభ కనబరిచాడు. కేజీబీవీ బాలికల పాఠశాలలో 40 మందికి 19మంది ఉత్తీర్ణులయ్యారు.

**ప్రతిభ కనబరిచిన గ్రామీణ విద్యార్థులు**

రామభద్రపురం: గ్రామీణ ప్రాంత విద్యార్థులు సత్తా చాటారు. ఆరికతోట ఉన్నత పాఠశాలకు చెందిన పెదపెంకి సాయి కౌషిక్ మండల టాపర్‌గా నిలిచాడు. అలాగే సూరాబత్తుల లహరి, రామభద్రపురం ఉన్నత పాఠశాలకు చెందిన యు. రాజేష్, పి. త్రివేణి , టి. దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచారు. బూసాయవలస కేజీబీవీ పాఠశాల విద్యార్థిని ఎ. యశశ్విని.. కొట్టక్కి ఉన్నత పాఠశాలలో యు. ప్రవళిక.. కోట హిమ అత్యధిక మార్కులు సాధించారు. రొంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన బి, కల్యాణి టాపర్‌గా నిలిచింది. రామభద్రపురం పాఠశాలలో 209 మందికి 144 మంది.. కొట్టక్కి ఉన్నత పాఠశాలలో 62 మందికి 48 మంది.. రొంపల్లిలో 21 మందికి 17 మంది.. బూసాయవలస కేజీబీవీలో 39 మందికి 29 మంది... ఉన్నత పాఠశాలలో 22 మందికి 16 మంది.. ఆరికతోట ఉన్నత పాఠశాలలో 67 మందికి 56 మంది.. పాతరేగ ఉన్నత పాఠశాల 19 మందికి 16 మంది ఉత్తీర్ణత సాధించారు.

తెర్లాం: మండల కేంద్రంలోని హైస్కూల్‌కు చెందిన నేరెళ్ల ఈశ్వర వైకుంఠ నారాయణ, పి.ఇంద్రాణి, సీహెచ్.అజయ్, ఎం. విజయలక్ష్మి, ఎం.హరికృష్ణ ప్రతిభ కనబరిచారు. ఉద్దవోలు హైస్కూల్‌కి చెందిన వాకాడ మౌనిక.. నెమలాం హైస్కూల్‌కి చెందిన చొక్కాపు సింహాచలం.. మద్రాపు యువరాజ్ టాపర్లుగా నిలిచారు. పెరుమాళి ఆదర్శ పాఠశాల విద్యార్థుల్లో బి.హేమ, ఎన్.చందు, తేజేశ్వరరావు, పి.పావని ఎం.జోత్స్న, ఈ.సీరజ మంచి మార్కులు సాధించారు.

మెంటాడ: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించారు. చల్లపేట ఉన్నత పాఠశాలకు చెందిన చింత శివ మండల టాపర్‌గా నిలిచాడు. మెంటాడ పాఠశాలకు చెందిన కల్లూరు కల్యాణి సెకెండ్ టాపర్‌గా నిలిచినట్లు ఎంఈఓ ఎం. వెంకటరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 471 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 383 మంది పాసయ్యారు.

**గురుకుల విద్యార్థుల సత్తా..**

రేగిడి: పదో తరగతి ఫలితాల్లో స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా కనబరిచారు. మొత్తం 74 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 69 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు తెలిపారు. అలికాన రామ్‌చరణ్, ముడిదాన నిరంజన్, బూరాడ పవన్ టాపర్లుగా నిలిచారు.

**యూకే గుమ్మడలో 100 శాతం..**

వంగర: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. యూకే గుమ్మడ పాఠశాలలో శతశాతం, కొప్పరలో 99 శాతం, వంగరలో 91.78 శాతం, ఎం.సీతారాంపురంలో 88.23 శాతం, మడ్డువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 83.54 శాతం , కోనంగిపాడులో 79.16 శాతం, మరువాడలో 77.2 శాతం, అరసాడలో 50 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు

**ఉత్తీర్ణత శాతం 80.45..**

రేగిడి: మండలంలో పదో తరగతి ఫలితాల్లో 80.45 శాతం ఉత్తీర్ణత లభించిందని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు శనివారం మీడియాకు తెలిపారు. మండలంలో మొత్తం 555 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 527 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అంబఖండి ఉన్నత పాఠశాల టాపర్‌గా పల్లి శిరీష , ఖండ్యాం ఉన్నత పాఠశాల టాపర్‌గా కొరికాన మదన్ నిలిచారు.

సంతకవిటి: మండలంలోని తొమ్మిది జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు ఓ కేజీబీవీ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

రాజాం: పదో తరగతి ఫలితాల్లో రాజాం పట్టణంతో పాటు మండలంలో 61 శాతం ఉత్తీర్ణత లభించిందని ఎంఈఓ పొండ్రంకి నాగయ్య శనివారం మీడియాకు తెలిపారు. రాజాం నుంచి 853 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 523 ఉత్తీర్ణత సాధించారన్నారు. దీంతో 61.31 శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. బొద్దాం జెడ్పీ హైస్కూల్‌లో 82 మందికి 40 మంది, దోసరి పాఠశాలలో 29 మందికి 19 మంది, కంచరాం ఉన్నత పాఠశాలలో 134 మందికి 73 మంది, పొగిరి జెడ్పీ హైస్కూల్‌లో 146 మందికి 94 మంది, రాజాం (సారధి) జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 55 మంది విద్యార్థులకు గాను 31 మంది, రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 205 మందికి 128 మంది, రాజాం కేజీబీవీ పాఠశాలలో 41 మందికి 30 మంది, డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో 161 మందికి 108 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. బొద్దాం స్కూల్ టాపర్‌గా మడ్డు చిరంజీవి, దోసరి స్కూల్ టాపర్ కె.గాయత్రిశ్రీ,, కంచరాం స్కూల్ టాపర్‌గా ఎస్.లావ్య, పొగిరి స్కూల్ టాపర్‌గా లెంక జగదీష్, రాజాం(సారధి) జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ టాపర్‌గా ఆర్.అక్షిత, రాజాం కేజీబీవీ పాఠశాల టాపర్‌గా శ్యామల, డోలపేట హైస్కూల్ టాపర్‌గా వి.వాసుదేవరావు నిలిచారు.